క్లుప్తంగా

పాఠశాలకు ఫ్యాన్లు, లౌడు స్పీకర్ల వితరణ



పాఠశాలకు అందించిన పరికరాలతో బ్యాంక్ సిబ్బంది

బుచ్చెయ్యపేట: రాజాం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు కెనరా బ్యాంకు సిబ్బంది మూడు ఫ్యాన్లు, లౌడు స్పీకర్లు, యాంపిల్ ప్లేయర్లు అందించారు. బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వీటిని హెచ్‌ఎం శ్రీనివాసరావుకు బ్యాంక్ మేనేజర్ వంశీ శనివారం అందించారు. ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తామని మేనేజర్ తెలిపారు. సర్పంచ్ మరిసా నాని, ఎంపీటీసీ మరిసా నాగమణి రమణ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కర్రి నాయుడుబాబు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణులు

కె.కోటపాడు: చౌడువాడలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ కుటుంబాలు, గ్రామ పెద్దలు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఏటా కార్తీకమాసంలో వచ్చే నాగుల చవితి మరుసటి రోజున వీరబ్రహ్మేంద్రస్వామి వేడుక నిర్వహిస్తారు. ఇందులో భాగగా రామాలయం, పద్మశాలీ వీధుల్లో బ్రహ్మంగారి చిత్రపటాన్ని భజన, గీతాలు ఆలపిస్తూ ఊరేగింపు చేశారు. ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

సాగరం కాలనీలో ఉచిత క్యాన్సర్ శిబిరం

మాడుగుల రూరల్: అగనంపూడి హోమీమో బాబా క్యాన్సర్ ఆస్పత్రి, రిసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో సాగరం కాలనీలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం శనివారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 50 మందికి రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్, తదితర క్యాన్సర్ పరీక్షలు చేశారు. వైద్యురాలు సంగీత ప్రజలకు అవగాహన నిర్వహించారు. సర్పంచ్ కోట్ని జయమ్మ, సన్యాసినాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీనాథు సూర్యకాంతం, జగ్గారావు తొలుత శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కింతలి పీహెచ్‌సీ వైద్యులు కె.ఎం.నాయుడు, నాగదివ్య, పంచాయతీ కార్యదర్శి ప్రసాదు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ : వృద్ధుడికి గాయాలు



గాయాలైన బలరామూర్తి

బుచ్చెయ్యపేట: వడ్డాది జంక్షన్‌లో గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. వడ్డాదికి చెందిన బత్తుల బలరామూర్తి శనివారం ఇక్కడ జంక్షన్ నుంచి ఇంటికి నడిచి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వాహనదారుడు ఢీకొట్టి ఉడాయించడంతో వృద్ధుడు ఒంటిపైన, తలపైన తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఎస్‌ఐ కుమారస్వామి విచారణ చేస్తున్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు



హైకోర్టు న్యాయమూర్తి మానవేంద్రనాథ్ రాయ్‌తో బార్ అసోసియేషన్ ప్రతినిధులు

నర్సీపట్నం: ఏపీ హైకోర్టు నుంచి గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీపై వెళ్లిన జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ శనివారం విశాఖపట్నం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను నర్సీపట్నం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రావాడ సత్యనారాయణ, పలువురు న్యాయవాదులు మర్యాద పూర్వకంగా కలిశారు. నర్సీపట్నంలో జిల్లా కోర్టు ఏర్పాటుకు కమిటీ ఆమోదించినట్టు హైకోర్టు న్యాయమూర్తి తెలిపినట్లు ప్రెసిడెంట్ సత్యనారాయణ తెలిపారు. న్యాయమూర్తిని కలిసిన వారిలో కృష్ణమోహన్, విశాఖ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చింతల రాంబాబు, లోవరాజు, ఎస్.కె.నాయుడు ఉన్నారు.

వరి కోతలు ప్రారంభం

- పంట కోసిన పొలాల్లో అపరాల సాగు
- ఆశాజనకంగా వరి పంట



బుచ్చెయ్యపేట: లూలూరులో వరి పంటను కోస్తున్న కూలీలు



బుచ్చెయ్యపేట: కోసిన వరి పంటను ఆరబెట్టిన రైతులు



మాడుగుల మండలం జేడీపేటలో పంట దశకు చేరుకున్న వరి చేలు

బుచ్చెయ్యపేట: మండలంలో ఖరీఫ్ వరి కోతలు ప్రారంభమయ్యాయి. పలు గ్రామాల్లో రైతులు వరి పంటను కోసి పొలాల్లోనే పనలుగా వేసి ఆరబెడుతున్నారు. జుల్తై, ఆగస్టు నెలల్లో కురిసిన వర్షాలకు మండల రైతులు ఖరీఫ్ వరినాట్లు వేశారు. ఈ ఏడాది 6,800 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశారు. పెద్దేరు, కోనాం రిజర్వాయర్ల నీరుతోపాటు వడ్డాది, మంగళాపురం, విజయరామరాజుపేట, కుముదాంపేట,చిన అప్పనపాలెం గ్రామాలు, దిగువ ప్రాంతాలైన గంటికొర్లాం, లోపూడి, లూలూరు, శింగవరం, పీడీ పాలెం తదితర గ్రామాల్లో వరి పంటకు సాగు పుష్కలంగా అందింది. దాంతో ఆయా గ్రామాల్లో వరి పంట ఆశాజనకంగానే పండింది. దీన్ని రైతులు కోసి ఆరబెట్టి కుప్పలు పెడుతున్నారు. ఎర్రవాయి గ్రామాలైన రాజాం, కందిపూడి, ఆర్. భీమవరం, శివరాంపురం, మల్లాం, తురకలపూడి, తైపురం, నీలకంఠాపురం తదితర గ్రామాల్లో వర్షాభావ పరిస్థితులు కారణంగా వరి పంట దెబ్బతింది. పలువురు రైతులు వరి పంట కోసిన పొలాల్లో ప్రత్యామ్నాయంగా మినప, పెసర, నువ్వులు, జనుము, జీలుగ తదితర అపరాల పంటలు వేస్తున్నారు. తేలిక పంటలైన సాంబమసూరి, జయ, సూపర్ జయ, 1010 తదితర రకాల వరి పంట కోత దశకు వచ్చింది. వారం, పది రోజుల్లో ఆర్‌జీఎల్, బొండాలు తదితర రకాలు కోత దశకు చేరుతాయని మండల రైతులు తెలియజేస్తున్నారు.

కోతలకు సిద్ధంగా వరి చేలు

మాడుగుల: మండలంలో ఖరీఫ్ వరి చేలు దాదాపు పంట దశకు చేరుకున్నాయి. ఈ ఏడాది వర్షాలు అనుకూలించకపోయినా పెద్దేరు, తారకరామ, పాగలగెడ్డ, గొరిగెడ్డ జలాశయాలు, సాగునీటి చెరువుల ఆధారంగా పది వేల ఎకరాల్లో వేసిన ఖరీఫ్ వరి చేలు కోతకు సిద్ధమయ్యాయి. చివరి దశలో దోమతెగుళ్లు ఆశించినా క్రిమిసంహారక మందులు పిచికారీ చేసి పంటను రైతులు కాపాడుకున్నారు.

రైతులకు అండగా రైతు భరోసా కేంద్రాలు

మరోవైపు ఖరీఫ్ వరి పంటను కొనుగోలు చేయడానికి రైతు భరోసా కేంద్రాలు సిద్ధమవుతున్నాయి. రైతులు దళారులు బారిన పడకుండా గిట్టుబాటు ధర కల్పించడానికి వీటిని ఏర్పాటు చేశారు. దీంతో రైతులు పంట నూర్పి అనంతరం పొలాల్లోనే ధాన్యం విక్రయించనున్నారు. వరి నూర్పిడి యంత్రాలు మండలంలో 80 వరకు సిద్ధంగా ఉన్నాయి.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

మాడుగుల: సేంద్రియ ఎరువుల వాడకం పెంచుతూ క్రమేపీ రసాయన ఎరువులు తగ్గించడంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏవో ఎ. వాసుదేవరావు తెలిపారు. వైఎస్సార్ పొలం బడిలో భాగంగా కింతలి వల్లాపురంలో శనివారం ఆయన మాట్లాడారు. పై విధంగా చేయడం వల్ల పంటకు మిత్ర పురుగులు రక్షణగా నిలుస్తాయన్నారు. ప్రధానంగా ప్రతి రైతు విత్తన శుద్ధిపై అవగాహన పెంచుకోవాలన్నారు. అంతకు ముందు సీజనల్ పంటలపై పొలాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీటీసీ బగుడు వరహాలమ్మ, సర్పంచ్ తాళ్లపరెడ్డి రాంబాయి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి తాళ్లపురెడ్డి సోమన్నదొర, ఆర్బీకే సిబ్బంది వై.కల్యాణ్, ఎం.సతీష్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఆడుదాం...ఆంధ్ర క్రీడా పోటీలు



అవగాహన కల్పిస్తున్న దేవరాపల్లి ఎంఈవో–2 ఉషారాణి



అవగాహన కల్పిస్తున్న కె.కోటపాడు ఎంపీడీవో ప్రసాద్

కె.కోటపాడు/దేవరాపల్లి/నాతవరం: ఆడుదాం... ఆంధ్ర కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని అధికారులు తెలిపారు. సచివాలయ స్థాయిలో వచ్చే నెల 14 నుంచి 21వ తేదీ వరకు 15 నుంచి 18 ఏళ్లలోపు వారికి కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, షటిల్, క్రికెట్ పోటీలు నిర్వహించాలన్నారు. వీటి నిర్వహణపై శనివారం కె.కోటపాడు, దేవరాపల్లి, నాతవరం హైస్కూళ్లలో పీడీలు, సచివాలయ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా చోట్ల కె.కోటపాడు ఎంపీడీవో ప్రసాద్, దేవరాపల్లి, నాతవరం ఎంఈవోలు–2 వి. ఉషారాణి, కామిరెడ్డి వరహాలబాబు పాల్గొని మాట్లాడారు. నాతవరం ఎంపీడీవో హనుమంతరావు, సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, కె.కోటపాడు ఎంఈవో డీవీడీ ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయిని ఆర్.లక్ష్మి పాల్గొన్నారు.

కులగణనతో తూర్పు కాపులకు న్యాయం



సమావేశంలో పాల్గొన్న కాపు సంఘ నాయకులు

బుచ్చెయ్యపేట: ప్రభుత్వం చేపట్టే కులగణనను తూర్పు కాపు సభ్యులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం మండలాధ్యక్షుడు ముచ్చకర్ల అప్పారావు కోరారు. శనివారం బుచ్చెయ్యపేటలో తూర్పుకాపు సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల గణనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి చేపట్టే ఇంటింటి కులగణనను అధికారులు క్షేత్రస్థాయిలో చేపట్టడం వల్ల రాష్ట్రంలో తూర్పు కాపుల సంఖ్య తెలుస్తుందన్నారు. దీనివల్ల రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయింపుతో తూర్పు కాపులకు న్యాయం చేకూరుతుందన్నారు. బుచ్చెయ్యపేట కోఆపరేటివ్ అధ్యక్షుడు సుంకరి శ్రీను, సర్పంచ్ సుంకరి లక్ష్మి, మాజీ సర్పంచ్‌లు సుంకరి గాంధీ, డొంకిన అప్పలనాయుడు, పాల సంఘం అధ్యక్షుడు బాబ్జీ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు



వైద్యాధికారి రాజేష్‌నాయుడు

నాతవరం: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మారుమూల గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని వైద్యాధికారి ఎం. రాజేష్‌నాయుడు తెలిపారు. నాతవరం పీహెచ్‌సీలో శనివారం ఆయన సిబ్బందితో సమీక్షించారు. గ్రామంలోనే రోగులను పరీక్షించి, వారికి ఉన్న వ్యాధులను గుర్తించి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఆర్థిక ఇబ్బందులతో చాలా మంది పలు రోగాలతో వైద్యులను సంప్రదించకుండా ఇంటి వద్దే ఉండి బాధపడే వారన్నారు. అలాంటి వారందరికి జగనన్న ఆరోగ్య సురక్ష వరంగా మారిందన్నారు. ప్రధానంగా సరుగుడు, సుందరకోట గిరిజన పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం



శాలిపేట వీధిలో గౌరీపరమేశ్వరుల విగ్రహం

మాడుగుల రూరల్: కె.జె.పురంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక శాలిపేట వీధిలో ఉత్సవమూర్తుల విగ్రహం ఏర్పాటు చేశారు. సూరిశెట్టి కుటుంబీకులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో 21 రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ వారు తెలిపారు. ఈ సందర్భంగా రోజు సాయంత్రం ఆలయంలో భజనలు, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కళా వేదిక వద్ద.. స్థానిక కళా వేదిక వద్ద గౌరీపరమేశ్వరుల విగ్రహం నెలకొల్పారు. నెల రోజుల పాటు ఇక్కడ ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ జామి రమణబాబు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు తెలిపారు.

జోరుగా విద్యా దీవెన ఖాతాల ప్రారంభం

రోలుగుంట: జగనన్న విద్యా దీవెనకు సంబంధించి ఈ నెల 14 నుంచి స్థానిక ఏపీజీవీబీలో ఖాతాల కార్యక్రమం చేపట్టారు. బ్యాంకు మేనేజర్ నందిని సాహు సిబ్బందితో కలసి శనివారం నాటికి వంద మందికిపైగా విద్యార్థులకు ఖాతాలు తెరిచారు. మిగిలిన విద్యార్థులు విధిగా రెండు పాస్‌సైజు ఫొటోలు, ఆధార్, పాన్‌కార్డు జెరాక్సు తీసుకురావాలని సూచించారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

- ఎంపీపీ సత్యనారాయణ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యనారాయణ



సభ్యులను సముదాయిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణారావు

మాకవరపాలెం: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఏవో చిరంజీవి మాట్లాడుతూ మండలంలో 4,002 హెక్టార్లలో ఈ క్రాప్ నమోదు పూర్తి చేశామన్నారు. ఎంఈవో మూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివారెడ్డి జల్ జల్‌జీవన్ మిషన్ పనుల ప్రగతిని వివరిస్తుండగా, చామంతిపురం సర్పంచ్ కల్పించుకుని తమ గ్రామంలో తాగునీటి పైపులైన్లకు లీకేజీలు సరిచేయాలన్నారు. అదే సమయంలో శెట్టిపాలెం సర్పంచ్ అల్లు నాయుడు మాట్లాడుతూ తమ గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పనులను కాంట్రాక్టర్ జాప్యం చేయడంతో నిధులు రద్దు చేశారన్నారు. ఒక పంచాయతీ సమస్య చెబుతుండగా మధ్యలో మాట్లాడటం ఏంటని అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఎంపీపీ, ఎస్‌ఐ రామకృష్ణారావు సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది. ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీతామహాలక్ష్మి, తహసీల్దార్ ప్రసాదరావు, వైస్ ఎంపీపీ రాజారావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాన్ని పెంపొందించాలి



మాట్లాడుతున్న అకడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ ఎం.ఎం.పట్నాయక్

నర్సీపట్నం: విద్యార్థుల్లో కనీస విద్యా సామర్థ్యాల అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సమగ్ర శిక్షా అభియాన్ అనకాపల్లి అకడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ ఎం.ఎం.పట్నాయక్ పేర్కొన్నారు. నర్సీపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్(మెయిన్)లో శనివారం డివిజన్ స్థాయి అభ్యసనాభివృద్ధి కార్యక్రమం (ఎల్ఐపీ)పై ఎంఈవోలు, హెచ్‌ఎంలకు రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యసనాభివృద్ధిపై ఉపాధ్యాయులకు సమగ్ర అవగాహన ఉండాలన్నారు. కరోనా సమయంలో నష్టపోయిన విద్యార్థుల్లో కనీస విద్యా సామర్థ్యాలను పెంపొందించడమే శిక్షణ తరగతుల ఉద్దేశమన్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాల ద్వారా ఉపాధ్యాయుల్లో బోధన సామర్థ్యాన్ని పెంచాలన్నారు. ఎంఈవో సిహెచ్.తలుపులు, డైట్ ఫ్యాకల్టీ జి.రవి, టీచ్ టూ కోఆర్డినేటర్ పూర్ణచంద్రరావు, నోడల్ హెచ్‌ఎం సత్యనారాయణ, సీఆర్‌ఎమ్టీలు పూడి వెంకట్రావు, ఎం.లోకేశ్వరరావు, రామలక్ష్మి, ధారలక్ష్మి పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల నమోదు

- నర్సీపట్నం ఆర్డీవో జయరాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం



సమావేశానికి హాజరైన బీఎల్వోలు

నర్సీపట్నం: ఓటర్ల నమోదులో అవకతవకలు లేకుండా బాధ్యతగా నిర్వర్తించాలని ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెచ్.వి.జయరాం అన్నారు. శనివారం స్థానిక మున్సిపాలిటీ సమావేశ మందిరంలో మున్సిపల్ సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలోకి వెళ్లటం వల్ల ఓటరు నమోదు విషయంలో మంచి ఫలితాలు వస్తాయన్నారు. 80 ఏళ్లు పైబడిన ఓటర్లు, ఒకే ఇంటి నంబర్‌తో పది కంటే ఎక్కువగా నమోదైన ఓటర్లు, ఫొటో మార్పులు, ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. తహసీల్దార్ అన్నాజీరావు, మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు, ఎంపీడీవో జయమాధవి పాల్గొన్నారు.

3 పాఠశాలలకు కెనరా బ్యాంకు వితరణ



మంచాల పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందిస్తున్న కెనరా బ్యాంకు మేనేజర్

చీడికాడ: కెనరా బ్యాంకు ఫౌండేషన్ డే సందర్భంగా మండలంలోని మూడు ప్రభుత్వ పాఠశాలలకు రూ.45 వేల విలువ చేసే వివిధ సామగ్రిని అందించినట్లు చీడికాడ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ శివగణేష్ శనివారం తెలిపారు. జి.కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.13,500 విలువ గల బీరువా, టేబులు, ఎ.అగ్రహారం యూపీ స్కూల్‌కు రూ.13 వేల విలువ గల బీరువా, కుర్చీలు, మంచాల ఎంపీపీ పాఠశాలకు రూ.13,500 విలువ గల ఆఫీస్ టేబుల్, కుర్చీలు, వాటర్ ఫిల్టర్ అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బందితో పాటు ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు పోటీలు



చీడికాడ: చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు



కె.జె.పురం గ్రంథాలయంలో దేశభక్తి పోటీల్లో గీతాలు ఆలపిస్తున్న విద్యార్థిని



కె.కోటపాడు: చౌడువాడలో క్విజ్ పోటీలను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



రావికమతం: పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



మాకవరపాలెం: పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

రోలుగుంట: గ్రంథపాలకురాలు వరలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కేజీబీవీ లెక్చరర్ లక్ష్మి, జూనియర్ కళాశాల లైబ్రేరియన్ మల్లికార్జునరావు, జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు అరుణ్‌కుమార్ పర్యవేక్షించారు.

మాకవరపాలెం: పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని హెచ్‌ఎం కోసూరు రాము సూచించారు. శనివారం తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి, నారాయణరావు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం శాఖా గ్రంథాలయంలో శనివారం దేశభక్తి పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అటెండర్ వి. శృతి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో 8, 9, విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం వి.దాసు, ఉపాధ్యాయులు సూరెడ్డి జగన్మోహన్, శ్రీనివాస్, ప్రసాదు పాల్గొన్నారు.

రావికమతం: కొత్తకోట శాఖా గ్రంథాలయంలో శనివారం చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథపాలకురాలు వరహామణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: చౌడువాడ హైస్కూల్‌లో 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు సీనియర్, జూనియర్ విభాగాల్లో పలు పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకురాలు ఎం.పద్మావతి, హెచ్‌ఎం ఈర్లి అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాడుగుల: విద్యార్థి దశ నుంచి దేశభక్తిని అలవర్చుకోవాలని సర్పంచ్ ఎడ్ల కళావతి అన్నారు. గ్రంథాలయాధికారి వై. వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులకు దేశభక్తి గీతాలపై పోటీలు నిర్వహించారు. ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనువాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీడికాడ: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు లైబ్రేరియన్ జోగిశ్వరి తెలిపారు. ఉపాధ్యాయులు విజేతలను ప్రకటించారు.

దేవరాపల్లి: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలను ఉపాధ్యాయులు లావణ్య, సందీప్, అప్పలరాజు పర్యవేక్షించారు. గ్రంథాలయ అధికారి ఓ. శ్రీనివాసరావు పాల్గొన్నారు.